క్లుప్తంగా

జెడ్పీ అతిథిగృహం ప్రారంభం



అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్) : జిల్లాపరిషత్ ప్రాంగణంలో అన్ని వసతులతో ఏర్పాటు చేసిన నూతన అతిథి గృహాన్ని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. జిల్లాపరిషత్‌కు నూతన పాలకవర్గం ఏర్పాటైనప్పటి నుంచి వివిధ పనుల నిమిత్తం జెడ్పీకి వచ్చే జెడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్షులకు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా అతిథిగృహాన్ని ఏర్పాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రాంగణంలో డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయ భవనానికి కేటాయించిన భవనాన్ని తిరిగి జిల్లాపరిషత్ స్వాధీనం చేసుకుని ఆ భవనంలో రూ.12.50 లక్షలు వెచ్చిం అతిథిగృహంగా రూపుదిద్దారు. డీఎల్‌పీఓ కార్యాలయాన్ని డీపీఆర్‌సీ భవనంలోకి మార్చారు. జెడ్పీ అతిథిగృహం ప్రారంభోత్సవంలో జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, సీసీ అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



పూజల్లో ఎస్వీ మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్: స్థానిక ప్రకాష్ నగర్‌లోని సుంకులా పరమేశ్వరి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాతోవ్స కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, విజయమనోహరి పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ధ్వజ స్తంభ దాతలు భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్) : 2020–21 ఆర్థిక సంవత్సరంలో కావేరి జాదు విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...2021 నుంచి ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం తప్పించుకుని తిరుగుతున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అప్పట్లో 18 మండలాల్లోని 7288 ఎకారాల్లో 1889 మంది రైతులు పంట నష్టపోయినట్లు వ్యవసాయధికారులు నివేదిక ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. కార్యక్రమంలో నగేష్, భాస్కరరెడ్డి, వెంకటరాముడు, నారాయణ, స్వాములు పాల్గొన్నారు.

ఎస్ఈగా వేణుగోపాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న వేణుగోపాల్

కర్నూలు (టౌన్) : నగరపాలక ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా వేణుగోపాల్‌ను నియమిస్తూ ఇంజినీరింగ్–ఇన్–చీఫ్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఎస్ఈగా పనిచేస్తున్న ఆయన సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎస్ఈకి మున్సిపల్ ఇంజినీర్లు శేషసాయి, షాకీర్ హుస్సేన్, డీఈలు, ఇంజినీరింగ్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు వేసవిలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా అన్ని రకాల జాగ్రత్తలు చేపడతామని స్పష్టం చేశారు. అంతకు ముందు ఎస్ఈ వేణుగోపాల్ నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను మర్యాదపూర్వకంగా కలిశారు.

30న శ్రీరామ నవమి వేడుకలు

కర్నూలు కల్చరల్: తెలుగు గేరిలోని చిన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 30న శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు భార్గవ్ తెలిపారు. ఉదయం 8 గంటలకు నగరంలోని పుర వీధుల్లో శోభాయాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఇస్కాన్ ఆధ్వర్యంలో పూరి జగన్నాథ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

కర్నూలు (టౌన్) : మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ జన్మదినం పురస్కరించుకుని సోమవారం స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో చిరంజీవి యువత, అభిమానులు రక్తదానం చేశారు. కేక్ కట్ చేసి గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.

మండే కాలం..జాగ్రత్త సుమీ!

వేసవి ప్రారంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఓ వైపు ఎండ తీవ్రత.. మరో వైపు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు చల్లదనం కోసం వివిధ రకాల శీతలపానీయాలు తాగుతుండగా, మరికొందరు ఆరోగ్య సంరక్షణకు సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఫలితంగా అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో వేసవి పంజా విసురుతోంది. గత సంవత్సరం మహాశివరాత్రి పండుగ ముగియగానే వేసవి ఉష్ణోగ్రతలు పెరగ్గా ఈ ఏడాది కాస్త ఆలస్యంగా ఉగాది పండుగ ముగిసిన తర్వాత ఉష్ణోగ్రతలు అధికమయ్యాయి. ఈ ఆలస్యం కాస్త ఉపశమనం కలిగించినా భూ ఉపరితల ఆవర్తనం కారణంగా అటు ఎండ, ఇటు ఉక్కపోత ఏకకాలంలో దంచికొడుతున్నాయి. ఈ మేరకు జిల్లాలో పలు చోట్ల పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో జనం దాహం తీర్చుకునేందుకు బయట దుకాణాల్లో చల్లగా లభించే కూల్‌డ్రింక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో గత వారం రోజులుగా ఈ తరహా వ్యాపారం ఊపందుకుంది. ముఖ్యంగా సోడాలు, లెమన్లు, నన్నారి, లస్సీలు, ఫ్రూట్‌జ్యూస్ (పండ్ల రసాలు), కృత్రిమ రంగులతో తయారైన కూల్‌డ్రింక్స్ అధికంగా విక్రయిస్తున్నారు. శుభ్రత, నాణ్యత విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. పలు హోటళ్లు, రెస్టారెంట్లలోనూ రాత్రి మిగిలిపోయిన ఆహారాన్ని ఫ్రిడ్జ్‌లో ఉంచే మరుసటి రోజు వేడి చేసి విక్రయిస్తున్నారు. ఇవన్నీ జీర్ణకోశవ్యాధులకు దారితీస్తాయని సంప్రదాయక ద్రవాలైన మజ్జిగ, ఉప్పు కలిపిన పళ్ల రసాలు, నిమ్మరసం, మంచినీరు, ఇంట్లో వండుకున్న ఆహార పదార్థాలు ఆరోగ్యానికి మేలని సూచిస్తున్నారు.

వడదెబ్బకు గురయ్యేవారు

ఉపాధి హామీ పనుల్లో భాగంగా పనిచేస్తున్న కూలీలు. 50 సంవత్సరాల వయస్సుపైబడిన వారు తమ ప్రయాణంలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ వెంట తీసుకెళ్లాలి. వేడిమి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనిచేసేవారు (హోటల్స్ వంట గదుల్లో పనిచేసేవారు, కార్మికులు, రైతులు, నిర్మాణపనులు, ఇటుక బట్టీలలో పనిచేసేవారు, పోలీసులు, రోడ్డుపక్కన వ్యాపారం చేసే చిరువ్యాపారులు, ఎండలో ప్రయాణం చేసేవారు), గర్భిణులు, పాలిచ్చేతల్లులు, అప్పుడే పుట్టిన పిల్లలు, పసిపిల్లలు, రేకుల షెడ్డులో నివసించేవారు అధిక జాగ్రత్తలు తీసుకోవాలి. బీపీ, షుగర్, గుండెజబ్బులు ఉన్న వారు కూడా అప్రమత్తంగా ఉండాలి. వీరి శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఎక్కువ ఉష్ణాన్ని కోల్పోవడం ద్వారా వడదెబ్బకు గురవుతున్నారు.

వడదెబ్బ లక్షణాలు

తలనొప్పి, తలతిరగడం, నాలుక ఎండిపోవడం/పిడచకట్టుకుపోవడం/చెమట పట్టకుండుట, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం, మగత కలవరింతలు, ఫిట్స్, పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి.

ఎక్కువసేపు వ్యాయామాలు చేయకూడదు



వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు, ఉక్కపోత ఎక్కువగా ఉన్న సమయంలో శారీరక వ్యాయామాలు అధికంగా చేయకూడదు. దీనివల్ల శరీరం డీ హైడ్రేషన్‌కు గురై వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. ఎవరికైనా వాంతులు, విరేచనాలు, చెమట పట్టకపోవడం వంటి, కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటే మాత్రం వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి. వేసవిలో బయటి ఆహార పదార్థాలకు, పానీయాలకు దూరంగా ఉండాలి. వాటి వల్ల జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

–డాక్టర్ డి. శ్రీరాములు, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

పిల్లలను బయట తిరగనీయొద్దు



వేసవి కాలంలో పిల్లలను ఎక్కువగా బయటకు తిప్పకూడదు. ముఖ్యంగా ఎండ తీవ్రత అధికంగా ఉండే మధ్యాహ్న సమయంలో వారిని నీడపట్టున ఆడుకోనివ్వాలి. తగినంత నీరు తాగాలని వారికి సూచనలు ఇవ్వాలి. వేడి వాతావరణం పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే గాకుండా చర్మ సమస్యలకు గురిచేస్తుంది. వారు కలుషిత ఆహారం, పానియాలు తీసుకోకుండా జాగ్రత్త పడాలి. డీ హైడ్రేషన్‌కు గురిగాకుండా పండ్లు, పండ్ల రసాలు తరచూ ఇవ్వాలి. తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలి. పోషకాహారం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచాలి.

–డాక్టర్ కె. సింధూరరెడ్డి, పీడియాట్రిషన్, కర్నూలు

ముందస్తు జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకూడదు.
- తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ, ఉప్పు కలిపిన పళ్ల రసాలు తాగి బయలుదేరాలి.
- వేసవి కాలంలో తెల్లని దుస్తులు ధరించాలి. ముదురు రంగు దుస్తులు, నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఆల్కాహాలు తాగడం ద్వారా రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితికి దోహదం చేస్తాయి.
- ఇంటి గదులు ఉష్ణోగతను తగ్గించేందుకు కిటికీలకు, తలుపులకు తెరలను వాడి వేడిని తగ్గించాలి. ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్లు వాడాలి.
- వేడిగా ఉన్నప్పుడు ఎండలో గొడుగు లేకుండా తిరగకూడదు.
- బయటకు వెళ్లేటప్పుడు మంచినీటి బాటిల్‌ను వెంట తీసుకెళ్లాలి.
- తలకు తెల్లని టోపీ/రుమాలు ధరించాలి

వడదెబ్బ తగిలితే చేయాలి ఇలా..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి.
- అతని శరీరంపై ఉండే దుస్తులను తొలగించి చల్లని నీటితో కడగడం గానీ, చల్లని నీటితో ముంచిన గుడ్డతో తుడవడం చేయాలి.
- ఐస్‌ముక్కలను గుడ్డలో ఉంచి శరీరాన్ని తుడిచి, చల్లని గాలి తగిలేలా చూడాలి.
- రోగగ్రస్తులకు చల్లని నీరు, ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. ఓఆర్ఎస్ ద్రావకాన్ని తాగించాలి.
- ఇవన్నీ బాధితుడికి డాక్టర్‌కు చూపించేలోగా చేయాల్సిన చర్యలు. స్పృహ కోల్పోతే వెంటనే వైద్యసహాయం అందే ఏర్పాటు చేయాలి.

సంక్షిప్త సమాచారం

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు(టౌన్): జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం(డీఎస్ఏ)లో పనిచేసే గ్రౌండ్ వర్కర్లకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం స్టేడియంలో సీఈఓ రమణ చాంబర్‌లో దాత శ్రీధర్ రెడ్డి సహకారంతో సిబ్బందికి వితరణ చేశారు. చీఫ్ కోచ్ నటరాజరావు, బాస్కెట్‌బాల్ ప్రతినిధి దాదాబాషా పాల్గొన్నారు.

'ఉద్యోగం ఇవ్వడం లేదు'

కర్నూలు(హాస్పిటల్): తనకు ఉద్యోగం రానీయకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కావాలని జాప్యం చేస్తున్నారని నిరుద్యోగి జయరాజు ఆరోపించారు. సోమవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులను కలిసి తన సమస్యను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2021 సంవత్సరం డిసెంబర్ 29న నేషనల్ హెల్త్ మిషన్ కింద మూడు స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి 6వ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఈ మేరకు 30 మందిలో అధికారులు మెరిట్ జాబితా సిద్ధం చేయగా అందులో తనది ఐదవ నెంబర్‌గా చెప్పారు. అయితే, అధికారులు కౌన్సెలింగ్‌కు పిలవగా మొదటి ముగ్గురు గైర్హాజరైనట్లు తెలిపారు. ఆ తర్వాత నోటిఫికేషన్ ఇస్తే తనకు ఉద్యోగం వస్తుందని, కానీ ఏడాదికి పైగా అధికారులు ఆ చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.

పోలవరం ఎత్తు తగ్గించొద్దు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వరమైన పోలవరం ఎత్తును తగ్గించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆరోపించారు. సోమవారం ధర్నా చౌక్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దీక్ష చేపట్టారు. ఈ దీక్షను సీపీఐ జిల్లా కార్యదరి బి. గిడ్డయ్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథం, అవుల శేఖర్, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు ఏఐటీయూసీ నాయకులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ ఆసుపత్రిలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న 107 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులను అన్యాయంగా తొలగించారని ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న నిరసన

కర్నూలు(రాజ్‌విహార్): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజా రవాణా శాఖ ఉద్యోగులు చేపటిన ఆందోళన కార్యక్రమం కొనసాగుతోంది. 19వ రోజు సోమవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు–1, 2 డిపోల ఎదుట ఆ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విధుల్లో ఉండి చనిపోయిన ఉద్యోగులను పరామర్శించి, వారికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ జేఏసీ కర్నూలు జిల్లా చైర్మన్ గిరికుమార్ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ సభ్యుడు శ్రీనివాసులు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శులు ఆర్‌వీఎం రావు, మహేశ్వరరావు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల సాధికారతకు ప్రాధాన్యం



ఆసరా చెక్కు అందజేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



కార్యక్రమానికి హాజరైన మహిళలు

- ప్రతి సంక్షేమ పథకంలో వారికి పెద్దపీట
- వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో ఎమ్మెలే హాఫీజ్‌ఖాన్
- లబ్ధిదారులకు రూ.19. 90 కోట్ల మెగా చెక్కు అందజేత

కర్నూలు (టౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని పాతబస్తీ జమ్మిచెట్టు వద్ద వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు భారీగా తరలి వచ్చారు. 3,034 గ్రూపులకు చెందిన 30,340 మంది సభ్యులకు మంజూరైన ఆసరా నిధులు రూ.19,90,50000 చెక్కును ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలు గర్వంగా బతుకుతున్నారన్నారు. వారికి ఒక అన్నగా ఒక తమ్ముడిగా అండగా నిలిచిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో ఏ ఒక్క నాయకుడు కూడా మహిళలను, పేదలను, వారి ఆకలి కష్టాలను పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలకు ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే స్త్రీల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారన్నారు. కరోనా సమయంలో కూడా విజయవంతంగా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. జగనన్న ప్రజారంజక పాలన చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ కుట్రలు, కుతంత్రలు పన్నుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను డబ్బుతో కొనుగోలు చేసిందన్నారు. మోసాలు చేయడంలో ప్రతి పక్ష నేత చంద్రబాబు నాయుడు దిట్ట అన్నారు. ప్రస్తుత్తం అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకం అమలు కావాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కర్నూలులో బీజేపీ, టీడీపీ కలిసి పనిచేస్తున్నాయని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తనను ఆదరించిన కర్నూలు ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. మిగతా వారిలాగా తనకు ఎలాంటి వ్యా పారాలు లేవన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాషావలీ, పర్వీన్, ఆర్షియా పర్వీన్, సుజాతమ్మ, నీలోఫర్, జుబేర్ అహమ్మద్, పుల్లమ్మ, ఫారాజ్‌ఖాన్, నయిమ్‌పాషా, మేరి, టీపీఓ వెంకటలక్ష్మి, నాయకులు గడ్డం రామకృష్ణ, జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబర్ ఫైరోజ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

కర్నూలు(రాజ్‌విహార్): నగరప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే దర్బార్ నిర్వహించారు. ఆయన వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజల అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం

కర్నూలు(సెంట్రల్): చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల పోషకాహార వంటకాల ప్రదర్శనను ఆయన తిలకించి మాట్లాడారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలి...

ఎండల తీవ్ర ఎక్కుగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని హీట్‌వేవ్ ప్రిపరేషన్స్‌పై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.



పోషకాహార వంటకాల ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు (అగ్రికల్చర్) : సుంకేసుల గ్రామానికి చెందిన రాజీవ్ గాంధీ అనే వ్యక్తి సోమవారం కర్నూలులోని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వ్యక్తి వివాహమైనప్పటికీ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈమధ్య ఆమెతో మనస్పర్థలు రావడంతో జీవితంపై విరక్తి చెందిన కర్నూలు ధర్మపేటలోని ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణం చేసుకున్నాడు. మృతుని భార్య దేవిక ఫిర్యాదుతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసు నమోదు...

కర్నూలు (అగ్రికల్చర్): స్థానిక రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోరీ కేసు నమోదైంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన వెంకటసుబ్బమ్మ అనే మహిళ నగరంలోని రుతిక ఆసుపత్రికొచ్చింది. రూ.1.74 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదును ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుంది. గుర్తు తెలియని ఓ మహిళ ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి ఆభరణాలు,నగదు చోరీ చేసింది. తర్వాత చూసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.8.09 లక్షలతో పరార్

కర్నూలు (అగ్రికల్చర్): నగరంలోని పార్కు రోడ్డులో ఉన్న హ్యాపీ మొబైల్స్ అసిస్టెంట్ మేనేజర్ శరత్ రూ.8.09 లక్షలతో పరారయ్యారు. ఈయన నాలుగేళ్లుగా షాపులో పనిచేస్తూ నమ్మకాన్ని సంపాదించుకున్నాడు. దీనిని అవకాశంగా తీసుకుని అతను షాపులో ఉన్న రూ.8.09 లక్షలు తీసుకుని పరారైనట్లు ఏరియా సేల్స్ మేనేజర్ రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శరత్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : స్పందనలో వచ్చిన సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలోని తన చాంబర్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. స్పందనలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కర్నూలు(సెంట్రల్): కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేస్తున్న ఉద్యోగుల కుటుంబాలకు వెంటనే నియామక పోస్టులు ఇవ్వాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలను పరామర్శించారు. కరోనాసమయంలో కొందరు, ఇతర సమయాల్లో అనారోగ్యానికి గురైన పరిస్థితుల్లో మరి కొందరు ఉద్యోగులు చనిపోయారని, వారి కుటుంబీకులు కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేశారన్నారు. కర్నూలు జిల్లాలో సుమారు 70 మంది కారుణ్య నియామకాలు కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. అసోసియేట్ చైర్మన్ నాగరమణయ్య, రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

దోచుకోవడంలో చంద్రబాబుకు సాటిలేరు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా సంపదను దోచుకోవడంలో చంద్రబాబును మించిన నాయకుడు లేరని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవెలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు దారి మళ్లించారని, దీనికి నాటి ఆర్థిక శాఖ కార్యదర్శులు అభ్యంతరాలు తెలిపినా బాబు పట్టించుకోలేదన్నారు. వాల్మీకులను ఎస్టీలో జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

- పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ డమ్మీ కంపెనీ పేరుతో కోట్లాది రూపాయలను చంద్రబాబు తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నారన్నారు. నిధుల మళ్లింపుపై అన్ని ఆధారాలు ఉన్నాయని, త్వరలో పాత్రధారులతో పాటు చంద్రబాబు కూడా అరెస్టు అవుతారని చెప్పారు. ఇలాంటి అవినీతి సొమ్ముతోనే ఎమ్మెల్యేల కొనుగోలుకు తెగబడ్డారన్నారు. బాబు మాయలో పడిన వాళ్లు ఎవరూ ఇప్పటి వరకు బాగుపడలేదన్నారు. వాల్మీకులకు అన్ని విధాలా గుర్తింపు కల్పించింది సీఎం జగన్ మాత్రమే అని, పదవులు ఇవ్వడంతో పాటు ఎస్టీల జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయించడం అభినందనీయమన్నారు.
- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూధన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన వాల్మీకులకు వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పించిందని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు సుభాష్‌చంద్రబోస్, శ్వేతారెడ్డి, మద్దయ్య, ధనుంజయ ఆచారి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల పక్షపాతి సీఎం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ



లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసరా వారోత్సవాల కార్యక్రమాన్ని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ గ్రామాలకు ప్రాంతాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందించిన వైఎస్సార్ ఆసరా పథకం మెగా చెక్కును పంపిణీ చేశారు. ఎమ్మెల్యే, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుపై అందిస్తోందని చెప్పారు. 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తానని టీడీపీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి రాగానే మాఫీ హామీని చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్కచెల్లెమ్మల బాధలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న పొదుపు సంఘాల బ్యాంక్ లింకేజీ రుణాలను మాఫీ చేస్తానని నాడు హామీ ఇచ్చి అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే మూడు విడుతల్లో సాయం కూడా అందజేశారన్నారు. ఇందులో ఎవరిది విశ్వసనీయతో మీరే తెలుసుకోవాలన్నారు. 2019 నాటికి మండలంలో పొదుపు సంఘాల మహిళలు రూ. 19.76 కోట్లు బ్యాంకుల్లో అప్పు ఉండేదన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఆసరా పథకం కింద రుణాలు మాఫీ చేయగా, ప్రస్తుతం మూడవ విడత కింద మండలంలో 8,621 పొదుపు సంఘాల మహిళలకు రూ. 4.94 కోట్లు రుణ మాఫీ చేశామన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలభిషేకం చేసి మహిళలకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కేశవరెడ్డి, పెద్ద ఈశ్వరయ్య, సోమన్న యాదవ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.